‘భూ భారతి’తో మేలు జరిగేనా..?

- గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ
- రైతుల నుంచి దరఖాస్తుల వెల్లువ..
- సాదాబైనామా ఉన్నట్టా? లేనట్టా?
- అగ్రిమెంట్‌లపై ఉన్న వాటికి పట్టాలు వస్తాయా?



చొప్పకట్లపాలెం రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ నరసింహారావు (ఫైల్)

బోనకల్: గత ప్రభుత్వం 2018లో భూ సమస్యల పరిష్కారానికై ధరణి చట్టాన్ని తీసుకువచ్చి గత రికార్డుల్లో పొందుపరిచిన వాటిని రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించారు. అగ్రిమెంట్‌లపై ఉన్న వాటిని సాదాబైనమాల ద్వారా ఆన్‌లైన్ చేసి రైతులకు ఉచితంగా పాస్‌పుస్తకాలను అందించారు. ధరణిలో ఉన్న లొసుగులను ఆసరా చేసుకొని రికార్డుల్లో అవకతవకలు జరిగాయని ప్రస్తుత ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకంలోనైనా రైతులకు ప్రయోజనం చేకూరుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తంగా 2,158 దరఖాస్తులు..

మధిర నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా రెండో విడతలో బోనకల్ మండలాన్ని ఎంపిక చేశారు. మే 5 నుంచి 16 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. గార్లపాడులో 67, సీతానగరంలో 29, తూటికుంట్లలో 91, రామాపురంలో 45, జానకీపురంలో 42, చొప్పకట్లపాలెంలో 79, నారాయణపురంలో 99, చిరునోములలో 85, మోటమర్రిలో 167, గోవిందాపురం(ఎల్)లో 69, కలకోటలో 125, రావినూతలలో 122, రాపల్లిలో 144, ముష్టికుంట్లలో 185, బ్రాహ్మణపల్లిలో 53, చిన్నబీరవల్లిలో 139, ఆళ్లపాడులో 185, లక్ష్మీపురంలో 89, బోనకల్‌లో 58, రాయన్నపేటలో 61, పెద్దబీరవల్లిలో 165, గోవిందాపురంలో 59 మంది రైతులు వివిధ రకాల భూ సమ్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 2,158 దరఖాస్తులు చేసుకున్నారు. భూ భారతి చట్టంలో ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు, తప్పుల సవరణ, మ్యుటేషన్‌కి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదాబైనమాల దరఖాస్తుల పరిష్కారం, వారసత్వంగా వచ్చిన భూములపై విచారణ, భూమి హక్కులు ఏవిధంగా సంక్రమించాయో రికార్డులో నమోదు, పాస్‌పుస్తకంలో భూమిపటం, భూ సమస్యలపై అప్పీలు వ్యవస్థ, వ్యవసాయేతర భూములు గుర్తింపు, రైతులకు ఉచిత న్యాయసహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వాహణతో పాటు గతంలో ప్రభుత్వ భూమి, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు సంబంధించి ఎవరైనా పట్టా చేసుకోని ఉంటే వాటిని రద్దుపరచడం లాంటి అంశాలను భూభారతి చట్టంలో పొందుపరిచి ఉన్నారు.

సందేహంలో రైతన్నలు..

ప్రస్తుతం రైతుల చేతుల్లో ఉన్న ప్రభుత్వం, ఎండోమెంట్, అసైన్డ్, భూదాన్ భూమి పట్టాలను ప్రభుత్వం రద్దు చేసి స్వాధీనం చేసుకుంటుందా? అనే సందేహం రైతుల్లో నెలకొంది. అదేవిధంగా తాతల తండ్రుల నాటి నుంచి కొడుకులు, మనవళ్ల వరకు సాగు చేసుకుంటు అగ్రిమెంట్ మీద ఉన్న భూములకు పట్టాలు అందిస్తారా అనే సందేహం కలుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో సాదాబైనమా కింద రైతులు పెట్టుకున్న దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కారం చేస్తామని చెబుతున్నప్పటికీ ఆ అంశం కోర్టు స్టే విధించడం వల్ల పరిష్కారమయ్యే సూచనలు కనిపించడం లేదు. గత హయాంలో ఇచ్చిన పాత పాసుపుస్తకాల స్థానంలో కొత్త నమూనాతో పాస్‌పుస్తకాలు అందించడం సాధ్యమేనా? ఇలా అనేక సందేహాలతో రైతులు భూసమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..



పట్టాదారు పాస్‌పుస్తకం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. వారసత్వంగా మాతాత నుంచి మా నాన్నకు.. మా నాన్న నుండి నాకు 2ఎకరాల భూమి వచ్చింది. ఈ భూమికి సంబంధించి నేటికి పట్టాదారు పాస్‌పుస్తకం రాలేదు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికైనా వస్తుందేమోనని ఆశతో ఎదురుచూన్నా.

– బందం వెంకటేశ్వర్లు, రైతు, ముష్టికుంట్ల

క్లుప్తంగా

ముగిసిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని శుభమస్తు కల్యాణమండపంలో గురువారం నిర్వహించిన గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం కాకపోవడంతో వాయిదాపడింది. ప్రస్తుతం ఎర్రుపాలెం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కొనసాగుతున్న షేక్.ఇస్మాయిల్, స్థానిక సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావులు పోటీలోకి దిగారు. ఇరువర్గాలు తమ తమ మద్దతు దారులతో కమిటీ సమావేశంలో బల ప్రదర్శన చేశారు. దీంతో స్పందించిన మండల కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పోటీదారులు తమ పేర్లను ఇవ్వాలని కోరగా.. అధ్యక్ష పదవికి 30మంది దరఖాస్తులు అందించి పేరు నమోదు చేసుకున్నారు. పలు గ్రామాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయగా.. పలుచోట్ల పోటీదారులు ఉండడంతో వారి పేర్లను రాసుకున్నారు. పోటీ ఎక్కువగా ఉండటంతో పోటీదారుల పేర్లను పరిశీలించి గ్రామ కమిటీల అధ్యక్షులను త్వరలో ప్రకటిస్తామన్నారు.

విచారణ జరపాలి

సత్తుపల్లి: దేశంలో ఆదివాసీ హక్కుల కోసం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు అడవిబాటపట్టిన నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో కేంద్రప్రభుత్వం కాల్చిచంపుతుందని దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎస్‌కె ఉమర్ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో గురువారం ఆ పార్టీ ఆధ్వర్యాన నక్సలైట్ల ఎన్‌కౌంటర్‌పై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, జయమ్మ, లక్ష్మి, రాఘవులు, ప్రసాద్, చెన్నారావు, రంగారావు, చలపతి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మధిర: మధిర సీపీఎస్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలో పృథ్వీరాజ్ నాయక్ పాల్గొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఉపాధ్యాయులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి తగిన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు దివ్య, సిబ్బంది వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య, విజయ కుమారి, విజయలక్ష్మి, ఆశ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

కిష్టారంలో..

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావిత గ్రామమైన సత్తుపల్లి మండలం కిష్టారంలో గురువారం సింగరేణి ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిష్టారం ఓసీ పీఓ నర్సింహారావు, డాక్టర్ శిరీష, పంచాయతీ కార్యదర్శి రమణ, వెల్ఫేర్ అధికారి విజయ్ సందీప్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం



ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధి, సంక్షేమాన్ని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే చేసిన చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని బేతుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆమె అందించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఏఈ పవన్, నాయకులు దయానంద్, శ్రీనివాసరావు, ఆనంద్, శ్రీనివాసరావు, చెన్నారావు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు తరలిరండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: ఈనెల 24న వైరాలో నిర్వహించే జాబ్ మేళాకు నిరుద్యోగ యువత తరలిరావాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం కారేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 80 కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్న ఈ జాబ్‌మేళాలో నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగం పొందాలన్నారు. అనంతరం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, సీఐ తిరుపతిరెడ్డి, ఎంపీఓ రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల వితరణ

పెనుబల్లి: ఆల్‌మైకో ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్లను గురువారం వితరణగా అందజేశారు. మండలంలోని అడవిమల్లేలలోని ఇద్దరు, పాత కారాయిగూడెంలో ఒకరు మొత్తం ముగ్గురి దివ్యాంగులకు ఆల్‌మైకో ద్వారా బ్యాటరీ ట్రై సైకిళ్లను వితరణగా అందించారు. కార్యక్రమంలో అడవిమల్లేల మాజీ సర్పంచ్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం, నోట్‌పుస్తకాలు ఉచితం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందిన మొదటి వంద మంది విద్యార్థులకు యూనిఫాంతో పాటు నోట్‌పుస్తకాలు ఉచితంగా అందిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి తెలిపారు. గురువారం ఇంటర్‌లో 984 మార్కులు సాధించిన ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థిని పఠాన్ సానియకు అడ్మిషన్ అందించి ఉచితంగా యూనిఫాం, నోట్ పుస్తకాలు అందించారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించి అడ్మిషన్ పొందిన ఓపెన్ కేటగిరి విద్యార్థులకు డిగ్రీ మూడు సంవత్సరాల పాటు కళాశాల ఫీజును కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’



ముదిగొండ: మాట్లాడుతున్న రవికుమార్

ముదిగొండ/వేంసూరు: మండలపరిధిలోని పమ్మి రైతు వేదికలో, వేంసూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గోపాలకృష్ణ మాట్లాడారు. రైతులు పంట మార్పిడి విధానం పాటించాలని అన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు రశీదులు తీసుకుని భద్రపరుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ చైతన్య, ఏఓలు సరిత, అరుణకుమారి, అరుణజ్యోతి, ఉద్యాన అధికారి విష్ణు, ఏఈఓ లిఖిత, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్‌లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, శాస్త్రవేత్తలు ఎం.రాంప్రసాద్, కె.శిరీష, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ రాజారావు, ఎంఏఓ రామ్మోహన్, ఎంహెచ్ఓ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమే లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కారేపల్లి: పేదవాడి సొంతింటి కల సాకారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం సింగరేణి మండలంలో ఆయన పర్యటించారు. అనంతరం కారేపల్లిలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు ఇంట్లో తేనేటి విందుకు హాజరై అనంతరం విలేకరుతో మాట్లాడారు. ఈ నెలాఖరు లోగా నియోజకవర్గానికి 3,500ల ఇండ్ల జాబితా ఫైనల్ కాబోతుందని, రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడుతలో భాగంగా 4.5లక్షల ఇళ్ల మంజూరు చేయడం జరిగిందన్నారు. రానున్న మరో నాలుగేళ్లలో 20లక్షల ఇళ్లను నిర్మించే దిశగా ప్రభుత్వం సంకల్పించిందన్నారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏ, వీఆర్ఓ వ్యవస్థలను రద్దు చేసిందని, ప్రజల కోరిక మేరక గ్రామాల్లో రెవెన్యూ అధికారులను నియమిస్తున్నట్లు, భూ సర్వేకు రాష్ట్రంలో 6వేల మంది లైసెన్స్ ట్రైన్డ్ సర్వేయర్లను నియమించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీనికి సుమారు 11వేల మంది దరఖాస్తు చేసుకోగా.. ఎంపికైన వారికి ఈ నెల 26 నుంచి 60 రోజుల పాటు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రతి మండలానికి 8మంది చొప్పున లైసెన్స్ సర్వేయర్లను నియమిస్తున్నామన్నారు. అనంతరం పలు శుభకార్యాలకు హాజరై ఆశీర్వదించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమాల్లో మాజీ మార్క్‌ఫెడ్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, మాజీ జెడ్పీటీసీ మల్లిబాబుయాదవ్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న వైరా ఏడీఏ కరుణశ్రీ

వైరా: డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మాలని చూస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ అన్నారు. గురువారం వైరాలోని రైతువేదిక భవనంలో విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విత్తనాలు అమ్మేటప్పుడు తప్పనిసరిగా రైతు పేరు, విత్తన కంపెనీ లాట్ నంబర్, సీరియల్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ తప్పని సరిగా వేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు పొందు పరచాలన్నారు. వైరా ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ.. విత్తన డీలర్లు దుకాణం ఎదుట స్టాకు వివరాలతో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా గ్రామాల్లో లూజు పత్తి విత్తనాల అమ్మకాలు సాగిస్తుంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓ వాసంతి, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

‘న్యూ లిటిల్ ఫ్లవర్స్’లో జిల్లాస్థాయి ఎన్‌సీసీ క్యాంపు

వైరా: ఎన్‌సీసీ 11(టి) బెటాలియన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో వైరాలోని న్యూ లిటిల్ ఫ్లవర్స్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో జిల్లాస్థాయి ఎన్‌సీసీ క్యాంపు ప్రారంభించారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్కే భద్ర మాట్లాడుతూ.. ఎన్‌సీసీ కేవలం శిక్షణే కాదని వ్యక్తిత్వ వికాసానికి మూలాధారమన్నారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశ భక్తి వంటి విలువలు పెంపొందించుకోవడంలో ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏఓ కల్నల్ నవీన్ యాదవ్ నేతృత్వంలో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు ఈ నెల 30వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. క్యాడెట్‌లు ఫైరింగ్ నేర్చుకునే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మొదటిరోజు ప్రారంభ కార్యక్రమంలో ఏఎన్ఓ థర్డ్ ఆఫీసర్ అపురూపాదేవి, పాఠశాల కరస్పాండెంట్ భూమేశ్వరరావు, డైరెక్టర్ సుమన్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

ముదిగొండ: మిల్లర్లు ధాన్యం తరుగుతీయకుండా చూడాలని గోకినేపల్లి రైతులు తహసీల్దార్ సునీత ఎల్లిబెత్‌కు గురువారం వినతిపత్రం అందించారు. స్పందించిన ఆమె సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దామోదర్, వ్యవసాయకార్మిక సంఘం మండల కార్యదర్శి భద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

ఓయూ అంకాలజీలో సత్తుపల్లి యువకుడికి సీటు

సత్తుపల్లిటౌన్: హైదరాబాద్ ఉస్మానియ మెడికల్ కళాశాలలోని రేడియేషన్ అంకాలజీ విభాగంలో సత్తుపల్లి యువకుడికి పీజీ మెడికల్ సీటు లభించింది. తెలుగు రాష్ట్రాల స్థాయిలో 17 సీట్లు మాత్రమే ఉన్న ఈ విభాగంలో సత్తుపల్లికి చెందిన ఎస్.సాయికిరణ్ సీటు సాధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ ఎస్.రవి, పద్మావతి దంపతుల కుమారుడు సాయికిరణ్ పదో తరగతి వరకు సత్తుపల్లి టాలెంట్ స్కూల్‌లో, ఇంటర్ ఖమ్మంలో చదివాడు. విజయవాడ సిద్దార్థ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఉస్మానియాలో సీటు లభించటంతో పలువురు అభినందనలు తెలిపారు.

విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వేంసూరు: ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం వేంసూరులో జరుగుతున్న ఎస్‌జీటీల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు రంగారావు, విజయ, అమృత్‌కుమార్, రత్నకుమార్, లింగం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి కమిటీ సమావేశం

ముదిగొండ: హనుమాన్‌జయంతి, బక్రీద్ పండుగల నేపథ్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో సీఐ మురళి మాట్లాడుతూ.. పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సై అనంతరాములు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి

బోనకల్: హరితవిప్లవ పితామహుడు స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలుచేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం పెద్దబీరవల్లి గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో నెలకొన్న రైతు ఆత్మహత్యలకు గల కారణం వ్యవసాయ సంక్షోభమే అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు నెరవేర్చాలి

సత్తుపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చేసి ఏడాది దాటిని పెన్షన్ బెనిఫిట్స్ మంజూరు కాకపోవటం దారుణమన్నారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి అందరు కృషిచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, విజయ అమృత్‌కుమార్, రత్నకుమార్, సతీష్, సుధాకర్‌రెడ్డి, మధుసూదనాచారి, రత్నరాజు, రవీందర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆదిల్‌షరీఫ్, వేణుగోపాల్‌రెడ్డి, ఏసురత్నం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కమల్‌రాజ్

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన రేఖ వెంకటేశ్వర్లు జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, నాయకులు గురిజాల హనుమంతురావు, గద్దం శ్రీను, కన్నెబోయిన కుటుంబరావు, మండె అప్పారావు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు నివాళి

సత్తుపల్లి: దళిత ఉద్యమ పితామహుడు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం, అక్షరాస్యత కోసం కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని మున్సిపల్ కమిషనర్ కోంద్రు నర్సింహా అన్నారు. గురువారం సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మైసా శ్రీనివాస్, ఏఈ సురేష్, ఆర్ఐ రామచందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైరాలో..

వైరా: దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమాన్ని గురువారం వైరా మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చింతా వేణు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరసింహామూర్తి, ఆర్ఐ ప్రదీప్, ఇంజనీర్ వెంకట్రావు, వార్డు ఆఫీసర్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

బోనకల్: ఈ నెల 28న ముష్టికుంట్ల గ్రామంలో జరగనున్న సీపీఐ 17వ మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేది సీపీఐ మాత్రమేనన్నారు. ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తూ అనేక సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావుతో పాటు జిల్లాస్థాయి నేతలు వస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రామారావు, మండల కార్యదర్శి ఆనందరావు, లక్ష్మీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల హత్య అమానుషం

తల్లాడ: ఒక వైపు శాంతి కోసం చర్చలు కోరుతున్న సమయంలో ఆపరేషన్ కగార్ పేరుతో మోదీ ప్రభుత్వం మావోయిస్టులపై కాల్పులు జరిపి మావోయిస్టు ప్రధాన కార్యదర్శి కేశవరావు, మరో 25 మందిని హత్య చేయడం అమానుషమని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్.లాల్‌మియా, కల్లూరు డివిజన్ నాయకులు దారావత్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం తల్లాడలో మావోయిస్టుల హత్యకు నిరసన తెలిపి.. మాట్లాడారు. ఈ సమావేశంలో తల్లాడ, ఏన్కూరు మండలాల సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



ఎర్రుపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్చకులు బాబాకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, కర్పూర హారతులిచ్చి పూజలు చేశారు. అర్చకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని శ్రీసాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

కిష్టారం సొసైటీ అధ్యక్షుడికి నివాళి..

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారానికి చెందిన సొసైటీ అధ్యక్షుడు మామిళ్లపల్లి కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆయన సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, డైరెక్టర్లు హాజరై ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ఈశ్వరి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పుల్లారావు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

జై హనుమాన్.. జైజై హనుమాన్.. నామస్మరణలతో హనుమాన్ ఆలయాలు మార్మోగాయి. హనుమాత్ జయంతి సందర్భంగా గురువారం భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పలుచోట్ల హనుమాన్ జెండాలు చేబూని శోభాయాత్ర నిర్వహించారు. అంజన్నను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరగా.. అర్చకులు హనుమాన్ చాలీసా చదివి వినిపించారు. అనంతరం చండీహోమం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు దాతలు వెండి ప్లేట్లు, శఠారి తదితర వస్తువులను బహుకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: అన్నదానం చేస్తున్న మల్లు నందిని



తల్లాడ: అంజనాపురంలో అన్నం వడ్డిస్తున్న దయానంద్



ఏన్కూరు: నృత్యం చేస్తున్న మహిళలు



సత్తుపల్లిరూరల్: అయ్యగారిపేటలో జలాభిషేకం చేస్తున్న భక్తులు



కల్లూరురూరల్: కల్లూరులో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు



కొణిజర్ల: తనికెళ్ల శివాలయంలో..



బోనకల్‌లో..




ముదిగొండ: వనంవారికిష్టాపురంలో..



సత్తుపల్లిటౌన్: మెట్టాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి



వైరారూరల్: గరికపాడులో.. అన్నదానం చేస్తున్న ఎస్సై రామారావు



చింతకాని: లచ్చగూడెం ఆంజనేయస్వామి ఆలయంలో..



కారేపల్లి: శ్రీవెంకటసాయినగర్‌లో..



కల్లూరు: శివాంజనేయస్వామి దేవాలయంలో..